పెద్దపల్లి

బుధవారం, 12, జూన్, 2024



సమస్యలు పరిష్కరించండి

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని ఆశ వర్కర్లు మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు.



అధికారికి సన్మానం

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీకి బదిలీపై వెళ్తున్న ఓసీపీ–3 సీనియర్ సర్వే అధికారి దీటి చంద్రమౌళిని కృషిభవన్‌లో అధికారులు మంగళవారం శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గరిష్టం/కనిష్టం
42.3/34.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నులిపురుగులను నియంత్రించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో 19 ఏళ్లలోపు వయసు వారిలో నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో కలిసి ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 20న అల్బెండోజెల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. నులిపురుగులతో రక్తహీనత, ఇతర ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 2,27,251మందికి మాత్రలు పంపిణీ చేస్తామని అరుణశ్రీ అన్నారు. ఏదైనా కారణంతో ఆరోజు తీసుకోలేనివారికి ఈనెల 27న అందించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, అధికారులు కృపాబాయి, కల్పన, ఆశాలత, రంగారెడ్డి, నాగలైశ్వర్, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రితో భేటీ



మంత్రి కిషన్‌రెడ్డితో ఎస్.కుమార్

గోదావరిఖని: కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని గోదావరిఖనికి చెందిన బీజేపీ కేంద్ర నాయకుడు ఎస్.కుమార్ మంగళవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. బొగ్గుగనుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డిని సన్మానించి, అభినందించారు.

డ్రోన్ సాయంతో హద్దుల గుర్తింపు



హద్దులు చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీకి చెందిన స్థలాల హద్దులను డ్రోన్ కెమెరా సాయంతో చిత్రీకరిస్తున్నారు. ప్రాజెక్టు టెంపరరీ టౌన్‌షిప్ మెయిన్ రోడ్డులో డ్రోన్ కెమెరాతో టీటీఎస్ స్థలం విస్తీర్ణంతో పాటు హద్దులను చిత్రీకరించారు. ప్రాజెక్టు ఆవరణలో నూతనంగా చేపట్టే తెలంగాణ స్టేజీ–2లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల మూడు యూనిట్‌లకు సంబంధించిన స్థలాన్ని గుర్తించేందుకు, ప్రాజెక్టు స్థల మ్యాపు తయారు చేసేందుకు డ్రోన్ కెమెరాతో పూర్తిస్థాయి స్థలాన్ని చిత్రీకరిస్తున్నారని తెలుస్తోంది.

జేఎన్టీయూలో ఆవిష్కృత్–24 ప్రారంభం



ఆవిష్కృత్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

రామగిరి(మంథని): సెంటనరీకాలనీ జేఎన్టీయూలో రెండురోజులపాటు జరిగే ఆవిష్కృత్–2024 ఫెస్ట్ మంగళవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి ఫెస్ట్ ప్రారంభించి మాట్లాడారు. ఇతర కళాశాలల విద్యార్థులు టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈఈఈ విభాగాధిపతి ఆర్.దుర్గారావు కన్వీనర్‌గా వ్యవహరించగా, మైనింగ్ విభాగాధిపతి శర్మ, డీఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపకులు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు ఎ.మేఘన, పి.విశిష్ట, ఎస్.సింధురెడ్డి, ఎస్.మానస, జి.కౌశిక్, చైతన్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆదిరెడ్డి

పెద్దపల్లిరూరల్: విత్తన, ఎరువుల డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఏవో అలివేణితో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు ప్రదర్శించాలని, రిజిష్టర్లలో నిల్వలను ఎప్పటికప్పుడు రాయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రశీదులు ఇవ్వాలని ఆయన సూచించారు.

చదవాలి.. మెరవాలి

ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



- సర్కారు బడుల్లోనే చదువుకున్నాం
- సమాజంలో ఉన్నతంగా ఎదిగాం
- పలువురు ప్రముఖుల మనోగతం
- నేడు పాఠశాలల పునఃప్రారంభం

సాక్షి, పెద్దపల్లి: ఏ రంగంలో రాణించిన వారైనా గురువు వద్ద పాఠాలు నేర్చుకున్నవారే. గురువు అందించిన విజ్ఞానం, ప్రోత్సాహం, స్ఫూర్తితో ఉన్నత స్థానాలు అధిరోహించినవారే. మెరుగైన సమాజ నిర్మాణంలో బడులు, గురువుల పాత్ర అనిర్వచనీయం. ప్రతీఒక్కరు బాల్యంలో తమ తల్లి, తండ్రి, లేదా అక్క, అన్న చేతివేలు పట్టుకుని పాఠశాలలో అడుగుపెట్టినవారే. అలాంటి చిన్నారులకు తన జ్ఞానం పంచి, మార్గనిర్దేశం చేసి ప్రపంచాన్ని పరిచయం చేస్తాడు ఉపాధ్యాయుడు. వేసవి సెలవుల్లో అనేక వ్యాపకాలతో ఉన్న పిల్లలు.. బడిగంట మోగగానే స్కూల్‌కు వెళ్లడానికి కాస్త బెరుకుగానే ఉంటారు. దీన్ని 'స్కూల్ ఫోబియా' అంటారు. దీన్నుంచి వారిని బయట పడేయాలనే సంకల్పంతో తమ చిన్ననాటి బడిస్మృతులను 'సాక్షి'తో పంచుకున్నారు ప్రముఖులు. జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు. తమను వెన్నుతట్టి ప్రోత్సాహించిన గురువులు, పాఠశాలలను నెమరువేసుకుంటూనే.. చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు.. వారి అనుభవాలు వారి మాటల్లోనే..

నేడు పాఠశాలలు పునః ప్రారంభం

జిల్లాలో బుధవారం స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఈనెల 6న అధికారుల బడిబాట ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 592, ప్రైవేట్ స్కూళ్లు 166 ఉన్నాయి. వీటిలో గతేడాది 97,333మంది చదువుకున్నారు. 'మన ఊరు– మన బడి' కింద 192 పాఠశాలలు ఎంపికచేసి మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. దాదాపు 35 బడుల్లో పనులు పూర్తిచేసి ప్రారంభించారు. ఈఏడాది 545 స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేశారు. సుమారు రూ.7కోట్లు వెచ్చించి మూత్రశాలలు, మరుగుదొడ్లు, మరమ్మతులు చేశారు. భవనాలు రంగులు వేసి ముస్తాబు చేశారు. తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేసేందుకు పాఠశాలల్లో నిల్వచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల సమక్షంలో వీటిని అందిస్తారు.

గురువులు ఏది చెప్పినా మన బాగుకోసమే



మా స్వస్థలం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట. 1970–71లో ప్రైమరీ స్కూల్‌లో చదివా. అక్కడే జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి పూర్తిచేశా. అడ్వకేట్‌గా పనిచేసే మా నాన్న సత్యనారాయణరావు.. ఎన్నిపనులున్నా పాఠశాలలు ప్రారంభమైన రోజు తానే నన్ను బడికి తీసుకెళ్లేవారు. టీచర్లతో మాట్లాడేవారు. ఆ రోజుల్లో గురువులు దండించినా అమ్మానాన్నలు అడిగేవారు కాదు. టీచర్లు ఏంచేసినా పిల్లల భవిష్యత్ కోసమే అని పేరెంట్స్ భావించేవారు. కానీ.. నేడు పరిస్థితులు మారాయి. పిల్లలకు చదువు, సంస్కారం రాకపోయినా.. దండించవద్దనే సంప్రదాయం ఉంది. తద్వారా తెలియకుండానే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతున్నారు. సర్కారు బడి టీచర్ల మార్గదర్శకత్వంలోనే నేను ఈస్థాయికి చేరా.

– రంగారావు, ఆర్టీఏ, పెద్దపల్లి

ప్రభుత్వ బడిలోనే చదివా



మా నాన్న అబ్దుల్ ఘని. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. 1992లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అప్పటి విద్యాశాఖమంత్రి పీవీ రంగారావు నుంచి అవార్డు తీసుకున్నారు. ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, నా కొడుకుని ప్రైవేట్ బడికి పంపడమేంటని నన్ను కరీంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ఇంటర్, డిగ్రీ కరీంనగర్ ఆర్ట్స్, ఎస్ఆర్ఆర్ కాలేజీలోనే పూర్తిచేశా. సర్కారు బడిలో చదివే నేను ఈస్థాయికి ఎదిగా. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభించదనేది కొందరు తల్లిదండ్రుల్లో ఉన్న అపోహ. డీఎస్సీలో మెరిట్ మార్కులు సాధించి ఉద్యోగంలో చేరేవారే ప్రభుత్వ టీచర్లు. డీఎస్సీలో జాబ్ రానివారు మాత్రమే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తారు. విద్యార్థులను నిరభ్యంతరంగా సర్కారు బడికి పంపించాలి. వారిపై ఖర్చుచేసే డబ్బు ఆదా చేస్తే వారి భవిష్యత్‌కు ఎంతోఉపయోగపడుతుంది.

– మహ్మద్ మేరాజ్, జిల్లా మైనార్టీ అధికారి

విద్యతోనే రాణింపు



నా పాఠశాల చదువు జగిత్యాల జిల్లాలోనే పూర్తిచేశా. మా అక్కయ్యలతో కలిసి బడికి వెళ్లేదాన్ని. ఇంగ్లిష్ టీచర్ ప్రదిన్న సర్, మ్యాథ్స్ టీచర్ దామోదర్ సర్ వాళ్లు నాకు ఫేవరేట్‌గా ఉండేవారు. నిరంతరం చదువుతోనే సమాజంలో గుర్తింపు పొందవచ్చని చెబుతూ ఉండేవారు. విద్యార్థి దశలోనే బడికి వెళ్లడం ద్వారా చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారం అలవడి, ఎంతోమంది స్నేహితులవుతారు. పాఠశాలస్థాయిలో నేర్చుకున్నదే భవిష్యత్‌లో చదువులోనైనా, జీవితంలోనైనా బేస్‌మెంట్‌గా ఉపయోగపడుతుంది. అప్పటితో పోల్చితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెరిగాయి. మన జిల్లాలో సైతం మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా కార్పొరేట్‌కు దీటుగా వసతులు అదుబాటులోకి వచ్చాయి.

– అరుణశ్రీ, అదనపు కలెక్టర్

అన్న సైకిల్ మీద పోయే వాడిని



నా చదువంతా కాగజ్‌నగర్‌లోనే. సుమారు రెండు కిలోమీటర్లకు పైగా దూరం ఉండే ప్రభుత్వ బడికి అన్నయ్య సైకిల్ మీద పోయేవాడిని. నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడు సోషల్ టీచర్ నజీర్ అహ్మద్, మ్యాథ్స్ టీచర్ కరుణాకార్ సారు ఉండేవారు. అప్పటివరకు యావరేజ్ స్టూడెంట్‌ని. క్లాస్‌లో వీడు బాగా చదువుతాడని సార్లు మెచ్చుకున్నారు.. అప్పటినుంచి టీచర్లు నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయవద్దనే భావనతో క్లాస్‌లో ఫస్ట్ ర్యాంకు వచ్చేలా చదువుకున్నా. విద్యార్థులతో కలిసిమెలిసి ఉంటూ ఎంకరేజ్ చేసే టీచర్లు ఉంటే ఆ ప్రభావం విద్యార్థులపై ఎప్పటికీ ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అప్పట్లో ఇన్నివసతులు లేవు. అబ్బాయిలకే కాదు.. అమ్మాయిలకు సైతం టాయిలెట్లు ఉండేవి కావు. ఇప్పుడు మంచి సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు నేను ఒకటే చెప్పదలుచుకున్న.. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది.

– సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, రామగుండం కార్పొరేషన్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: 'జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమవుతాయి.. సర్కారు బడులను బలోపేతం చేస్తాం.. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదాం' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఈవో మాధవితో కలిసి విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో సమావేశమయ్యారు. నూతన విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన కార్యాచరణపై కలెలెక్టర్ సమీక్షించారు. పలు సూచనలు చేశారు. బడిబాట ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు ఉచితంగా అందించే పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన పెంచి వారి పిల్లలను చేర్పించేలా చైతన్యపర్చాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని, యోగా సాధనపై శ్రద్ధ చూపాలని అన్నారు. నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించాలన్నారు. ప్రతీనెల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ అధికారి పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. గతనెలలో గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన హర్షవర్ధన్, అభినయ్ బంగారు పతకాలు సాధించిన వారితో పాటు పలువురిని కలెక్టర్ అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భోజన వర్కర్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి, నాలుగు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆందోళన చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూసాల రమేశ్ డిమాండ్ చేశారు. నాయకులు తాండ్ర సదానందం, కదారి సునీల్, స్వామి, గట్టయ్య, వసంత, లావణ్య, రజిత, మౌనిక, సరోజన, భాగ్యలక్ష్మి, మల్లీశ్వరి, పుష్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సీరియస్..

జిల్లాలో బుధవారం పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న తరుణంలో లీడర్లతో కలిసి వచ్చి నిరసన తెలపడం ఏమిటని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మధ్యాహ్న భోజన వర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు చేస్తామంటే సహించేది లేదని, విద్యార్థులకు భోజనం అందించకుండా ఇబ్బంది పెడితే విధుల్లోంచి తొలగించేందుకు కూడా వెనుకాడబోనని కలెక్టర్ హెచ్చరించారు. అయితే, బిల్లులు రాక నిత్యావసరాలు కొనుగోలుకు ఇబ్బంది అవుతందని, బిల్లులు విడుదల చేయాలన్నదే తమ ఆవేదన అని వర్కర్లు పేర్కొన్నారు.

బస్టాండ్‌ను ఆధునీకీకరించండి



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించి ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ రీజియన్‌లోనే అత్యధిక లాభాలు ఆర్జించే గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు మోడల్ తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామాలు, మెట్రో నగరాలు, పట్టణాలకు మరిన్ని సర్వీసులను నడిపించాలని కోరారు. తద్వారా ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగు పడడంతోపాటు ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వివరించారు. రామగుండం నియోజకవర్గంలో రూ.35 కోట్లతో త్వరలోనే బీసీ సంక్షేమ భవనం నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, తన కుటుంబీకులు మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కమల వికాసం!

- ఎంపీ ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి?
- ఇప్పటికే బండికి కేంద్ర సహాయ మంత్రి పదవి
- ధర్మపురి అర్వింద్‌కు సైతం పెరగనున్న ప్రాధాన్యం



బండి సంజయ్



అర్వింద్



రాజేందర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా బీజేపీ నేతలకు వరుస ఆఫర్లు దక్కుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ముగ్గురు నేతలు ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచాక పార్టీలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఇప్పుడు వీరందరికీ అదనపు బాధ్యతలు దక్కనున్నాయి. ఇప్పటికే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఖాళీ కానుండటంతో ఆ పోస్టు తిరిగి ఉమ్మడి జిల్లావాసులను వరిస్తుందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ఈరేసులో మాజీమంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముందున్నారు. అలాగే ఇదే పోస్టు కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా పోటీ పడుతున్నారు.

పార్టీ బలోపేతానికి ఈటలకు పదవి..?

బీఆర్ఎస్ నుంచి అనూహ్య పరిస్థితుల్లో బయటికి వచ్చిన ఈటలను బీజేపీ చేర్చుకుంది. 2021లో బీజేపీలో చేరిన ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఉపఎన్నిక అప్పట్లో సంచలనం. తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించిన అత్యంత ఖరీదైన ఉప ఎన్నికగా రికార్డులకెక్కింది. ఆ దరిమిలా ఈటల రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తూనే ఉన్నారు. గతేడాది బండి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న సమయంలోనూ ఈటల ఆ పదవి తనకు వస్తుందని ఆశించారు. కానీ, అధిష్టానం ఆ బాధ్యతలు కిషన్‌రెడ్డికి అప్పగించింది. వాస్తవానికి కేంద్ర కేబినెట్‌లోనే మంత్రి పదవి ఆశించిన ఈటలకు పొత్తుల కారణంగా సమీకరణాలు కుదరలేదు. దీంతో కాస్త నిరుత్సాహానికి గురైన ఆయన ప్రస్తుతం అధ్యక్ష పదవి కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అధిష్టానం కూడా ఈయన నాయకత్వంపై సానుకూలంగానే ఉందని సమాచారం. ఈటలకు పదవి ఇవ్వడం ద్వారా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన నాయకులనే కాకుండా బయటి నుంచి వచ్చినవారికి కూడా సముచిత ప్రాధాన్యం కల్పిస్తారన్న సంకేతాలు ఇచ్చే యోచనలో కమలనాథులు ఉన్నారని తెలిసింది. తద్వారా పార్టీలో కొత్త నేతలను ఆకర్షించాలన్న వ్యూహం రచిస్తున్నారని సమాచారం.

అర్వింద్‌కు కూడా పార్టీ పదవి..?!

ఇటీవల కోరుట్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన ధర్మపురి అర్వింద్ తర్వాత నిజామాబాద్ ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. ఎంతో సీనియర్ అయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఓడించి తన సత్తా ఏంటో చాటుకున్నారు. అర్వింద్ కూడా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి లేదా జాతీయ స్థాయిలో ప్రభావవంతమైన పదవి ఆశిస్తున్నారని తెలిసింది. వీరితోపాటు సీనియర్ నాయకులకు కూడా సరైన స్థానం కల్పించే యోచనలో పార్టీ ఉందని సమాచారం.

బీజేపీలోకి పలువురు కీలక నేతలు..!

కరీంనగర్ ఎంపీ సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలు పార్టీలకు చెందిన కీలక నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన నేతలే కాకుండా పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్లకు చెందినవారు సైతం పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఈనెల 15 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్నందున అవి ముగిసిన వెంటనే సంజయ్ కరీంనగర్ రానున్నారు. ఆయన వచ్చిన తర్వాత చేరికలు ఉండే అవకాశం ఉంది.

రాత్రి నోటిఫికేషన్.. వేకువజామున వాయిదా

- కేశోరాంలో కార్మిక సంఘం ఎన్నికలపై గందరగోళం
- అధికారుల తీరుపై కార్మికులు, కార్మిక నేతల్లో అసహనం

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొంది. ఈనెల 15వ తేదీన ఎన్నికల నిర్వహణకు తేదీ ఖరారు చేస్తూ సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు.. మంగళవారం ఉదయం ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల తీరుపై నాయకులు, కార్మికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లకోసారి ఎన్నికలు..

- కంపెనీలో ప్రతీ రెండేళ్లకోసారి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తారు.
- ప్రస్తుత కార్మిక సంఘం కాలపరిమితి ముగిసి దాదాపు 8నెలలు కావస్తున్నా మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు.
- దీంతో కార్మికులు ఇటీవల విధులు బహిష్కరించి కంపెనీ ఎదుట ఆందోళన చేశారు.
- స్పందించిన అధికారులు ఈనెల 10వ తేదీలోగా ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ఎన్నికలకు సుముఖంగా ఉందంటూనే..

- కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం సుముఖంగా ఉందని, అభ్యర్థులు ఈనెల 10న సాయంత్రం 5గంటలకు హెచ్ఆర్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఈనెల 8న కంపెనీ నోటీస్‌బోర్డుపై అధికారులు ఉత్తర్వుల కాపీని అంటించారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం అభ్యర్థులతో హెచ్ఆర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని ఎన్నికల అధికారిగా నియమించారు. ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం రాత్రి విడుదల చేశారు.

ఇదీ షెడ్యూల్

- ఈనెల 11ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ పత్రాల జారీ, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ.
- ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 2గంటలకు గుర్తుల కేటాయింపు.
- ఈనెల 15న ఉదయం 5.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్. సాయంత్రం 4గంటల నుంచి ఓట్ల లెక్కింపు.



బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం

కంపెనీ యూటర్న్..

- అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, అధికారులు ఎన్నికలపై అనూహ్యంగా యూటర్న్ తీసుకున్నారు. అనివార్య కారణాలతో ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నోటీస్ బోర్డుపై ఉత్తర్వుల కాపీ అంటించారు. రాత్రి నోటిఫికేషన్ జారీచేసిన అధికారులు.. తెల్లవారేసరికి వాయిదా వేయడం ఏమిటని కార్మికులు, నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బడానేత ఒత్తిడితోనేనా?!

- బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి, పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి తదితరులు మంగళవారం హెచ్ఆర్ మేనేజర్ పార్థసారథిని కలిసి ఎన్నికలు ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, త్వరలోనే ఎన్నికల తేదీ మళ్లీ ప్రకటిస్తామని హెచ్ఆర్ మేనేజర్ సమాధానం ఇచ్చారు. ఎలాంటి కారణం లేకుండా ఎన్నికలు వాయిదా వేయడం కంపెనీ 60ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి అని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాగా, అధికార పార్టీకి చెందిన ఓ బడానేత ఒత్తిడితోనే అధికారులు ఎన్నికలను అర్ధంతంగా వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. ఎన్నికలు నిర్వహించాలంటూ బుధవారం విధులు బహిష్కరించి కంపెనీ ఎదుట ఆందోళనకు కార్మికులు, నాయకులు సిద్ధమవుతున్నారని సమాచారం.

క్లుప్తంగా

కారును ఢీకొన్న లారీ

- తృటిలో తప్పిన పెనుప్రమాదం



జ్యోతినగర్(రామగుండం): కారును ఓ లారీ ఢీకొట్టగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి రవీంద్రనాథ్ మంగళవారం తన కుటుంబసభ్యులతో కలిసి కారులో కరీంనగర్ వైపు నుంచి గోదావరిఖనికి వస్తున్నాడు. ఇదే మార్గంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన పోతుల లక్ష్మణ్‌రావు లారీలో బెల్లంపల్లి వెళ్తున్నాడు. ఎన్టీపీసీ రామగుండం బీ-పవర్ హౌస్ డౌన్ రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అందరూ క్షేమంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసులు మల్లికార్జున్, అంజి పరిశీలించారు.

భూమి విషయంలో ఫిర్యాదులు

- ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం: భూ విక్రయం, రిజిస్ట్రేషన్ విషయంలో పరస్పర ఫిర్యాదులతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ రఘుపతి మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మాదాసు నరేశ్ సిరిసిల్లకు చెందిన రాజ్‌కుమార్ వద్ద భూమి కొనుగోలు చేశాడు. కానీ, అతను రిజిస్ట్రేషన్ చేయలేదు. తాను చెల్లించిన రూ.9.25 లక్షలు ఇవ్వాలని నరేశ్ అడగడంతో 6 నెలల్లో ఇస్తానని బాండ్ రాసిచ్చాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. డబ్బుల విషయమై తనపై దాడి చేశాడని రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పెద్దపల్లి డీటీ సస్పెన్షన్

సాక్షి, పెద్దపల్లి: విధుల్లో అలసత్వం వహించిన పెద్దపల్లి డీటీ కె.అజయ్‌ను సస్పెండ్ చేస్తూ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వానాకాలం 2023-24 సంవత్సరానికి గానూ సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)కు సంబంధించి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మేనేజర్‌తోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. అయితే, పెద్దపల్లిలో మండలంలో సివిల్ సప్లయ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డీటీ అజయ్‌కి సమాచారం ఇచ్చినా హాజరు కాలేదు. ఆయనకు కేటాయించిన రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్‌ను సేకరించడంలోనూ అలసత్వం వహించడంతో సివిల్ సప్లయ్ సర్వీస్ రూల్స్ ఆధారంగా సస్పెండ్ చేశారు.

పిల్లల జీవితం.. తీర్చిదిద్దుదాం

- వ్యక్తిత్వ నిర్మాణంలో గురువు, తల్లిదండ్రుల పాత్ర కీలకం

కరీంనగర్: జీవన ప్రగతికి చదువు కీలకం.. కానీ, అదొక్కటే జీవితం కాదు.. ప్రాపంచిక జ్ఞానం, మానవ ప్రేమ, మంచిచెడుల విచక్షణ, బంధాలు, అనుబంధాలు.. ఇలా ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్నదే వ్యక్తి జీవితం. అలాంటి జీవితం బడి గోడల మధ్యే నిర్మాణం కాదు. ఇందుకు ఒక్క గురువు పాత్రే సరిపోదు.. తల్లి, తండ్రి, కుటుంబం ఇలా అందరూ కీలకమే.

గురువు



విద్యార్థికి జీవితాన్ని నేర్పించేది గురువే. పోటీ ప్రపంచంలో గట్టెక్కేవాడు విజేత. ఆ దిశగా విద్యార్థిని తీర్చిదిద్దడంలో గురువుదే బాధ్యత. మూస పద్ధతిలో కాకుండా సబ్జెక్టులతో పాటు సమాజం గురించి వినూత్న రీతిలో బోధించాలి. ప్రతి విద్యార్థిపైనా దృష్టి పెట్టాలి. సమకాలీన ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని వారు ఔపోసన పట్టాలి. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవితకు దిక్సూచి కాగలరు.

అమ్మ



వ్యక్తిత్వ నిర్మాణంలో అమ్మ పాత్ర కీలకం. ఉదయమే నిద్రలేపడం, పిల్లలకు ఇష్టమైన మెనూ సిద్ధం చేయడం, పుస్తకాలు సర్ది పాఠశాలకు పంపడం వరకు తల్లి పాత్ర క్షణం తీరికలేనిది. ఇది రొటీన్‌గా మారకుండా చిన్నారుల్ని చదువులో మమేకం చేసేందుకు వీలున్న అంశాలపై తల్లులు అవగాహన పెంచుకోవాలి. విద్యా సంబంధమైన టీవీ కార్యక్రమాలు చూడడం, పుస్తకాలు చదవడం ద్వారా వీటిని బాగా వంటబట్టించుకోవచ్చు.

నాన్న



ఉదయాన్నే లేచి పిల్లల్ని పాఠశాల వద్ద దింపి రావడమే తమ బాధ్యత అనుకునే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. అవసరమైతే పుస్తకాలు, పెన్నులు కొనివ్వడాన్ని అదనపు బాధ్యతగా భావిస్తారు. సాయంత్రం పిల్లలు ఇంటికి రాగానే తండ్రి వారితో చక్కగా సంభాషించాలి. పిల్లల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. తల్లి కుటుంబ అంశాలపై అవగాహన పెంచితే, తండ్రి పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే తీరును నేర్పించాలి.

విద్యార్థి



ఎవరెన్నీ చెప్పినా.. తమ జీవిత రథచక్రాన్ని లాగాల్సింది విద్యార్థులే. ఒక స్థాయి వచ్చాక జీవితంపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. తనలోనూ ఒక అబ్దుల్ కలాం, ఒక సచిన్ టెండూల్కర్ ఉన్నారని నిత్యం స్ఫూర్తి పొందుతూ ఉండాలి. ఎంతటి ప్రముఖులైనా ఒక్క రోజులో ఆస్థాయికి రాలేదని గుర్తించాలి. మంచి గుణాలు కలిగితే అవకాశాలు వెన్నంటివస్తాయి. జీవితంలో పైకి ఎదగాలంటే మంచి విద్య అవసరమని గుర్తించాలి.

అంజన్న టెండర్లలో కాంట్రాక్టర్ల రింగ్



వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు

- ఈవో, అధికారుల ముందే డబ్బుల పంపిణీ
- ఆలయ సిబ్బంది తీరుపై భక్తుల అనుమానం



డబ్బులు పంచుతున్న టెండర్‌దారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ఇటీవల నిర్వహించిన పెద్ద జయంతి ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన వివిధ రకాల ముడుపులకు మంగళవారం నిర్వహించిన టెండర్లు వివాదాస్పదంగా మారాయి. భక్తుల ఇరుముడులు, దీక్ష మాలలు, ఇరుముడి బియ్యం సేకరణకు అధికారులు టెండర్ పిలిచారు. అయితే కాంట్రాక్టర్లు రింగై అధికారుల సమక్షంలోనే డబ్బులు పంచుకున్నారు. ఈ తతంగాన్ని మీడియా వీడియో తీస్తుండడాన్ని గమనించిన అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ముందుగా రూ.2.50లక్షలు పలికిన దీక్ష మాలల టెండర్‌ను రూ.3.66 లక్షల వరకు తీసుకెళ్లారు. బియ్యం కిలోకి రూ.23, ఇత్తడి గంటలు కిలోకి రూ.440, ఎండుకుడుకలు కిలోకి రూ.70, కొబ్బరికాయలు రూ.60వేలకు కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అయితే టెండర్లు నిబంధనల ప్రకారం నిర్వహించలేదని భక్తులు అంటున్నారు. ఈవో, సంబంధిత అధికారుల కళ్లముందే కాంట్రాక్టర్లు రింగై డబ్బులు పంచుకునా.. ప్రేక్షకపాత్ర పోషించారన్న విమర్శలు వస్తున్నాయి. టెండర్‌దారుల నుంచి అధికారులకు ముందుగానే ముడుపులు ముట్టాయా..? అందుకే ఇలా నామమాత్రంగా నిర్వహించారా..? అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇద్దరు టెండర్‌దారులు లావాదేవీల్లో భాగంగానే డబ్బులు ఇచ్చుకున్నామని తెలిపారని, అయినప్పటికీ వారిని టెండర్ నుంచి తొలగించి కొత్తగా టెండర్ పిలిచి పూర్తి చేశామని పేర్కొన్నారు. అనేక అనుమానాలు ఉన్న ఈ వ్యవహారంలో కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్ స్పందించి టెండర్లు రద్దు చేసి, అధికారులపై చర్యలు చేపట్టాలని అంజన్న భక్తులు అంటున్నారు. టెండర్ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు శ్రీనివాస్‌శర్మ, సునీల్, అధికారులు ఉమామహేశ్వర్, సంపత్ టెండర్‌దారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

- వేలిముద్రలు సేకరించిన పోలీసులు
- రూ.70 వేలు, 4 తులాల బంగారం పోయాయంటున్న బాధితులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో గుర్తు తెలియని వ్యక్తులు మూడిళ్లలో చోరీకి యత్నించారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అంజయ్య, కోరం లక్ష్మీరాజం, పుప్పాల గంగరాజంల కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇళ్లకు తాళాలు వేసి, డాబాపైన నిద్రించారు. దొంగలు వాటిని పగులగొట్టి, చోరీకి యత్నించారు. అయితే, రూ.70 వేలు, 3 తులాల బంగారం చోరీ అయ్యాయని అంజయ్య, తులంపావు బంగారం ఎత్తుకెళ్లారని లక్ష్మీరాజం తెలిపారు. పోలీసులు మాత్రం దొంగలు చోరీకి ప్రయత్నించారే తప్ప ఎలాంటి విలువైన వస్తువులు పోలేదని పేర్కొన్నారు. క్లూస్ టీం సభ్యులు మంగళవారం వేలిముద్రలు సేకరించారు.

కొడిమ్యాలలోని ఇంట్లో చోరీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రం రామకిష్టాపూర్ రోడ్డులోని నాగుల మహేశ్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రూ.50 వేలు, 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. వ్యక్తిగత కారణాలతో తాము వేరే ఇంట్లో ఉంటున్నట్లు పేర్కొన్నాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం సభ్యులు వచ్చి, వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

ఆరెపల్లి గ్రామంలో..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని ఆరెపల్లికి చెందిన మంజెడీ రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. రాజయ్య కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇంటి ఎదుట నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి, టీవీ, సెల్‌ఫోన్, రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన నడిగోట్ల శ్రీనివాస్ ఇంటి ఎదుట ఉన్న సంపు మోటార్‌ను, నడిగోట్ల లింగయ్య తన ఇంటి ఎదుట నిద్రించగా అతని సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ వారి ఇళ్లకు వెళ్లి, పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

అంగన్‌వాడీలకు 'భగీరథ' బాధ్యతలు సరికాదు

కరీంనగర్: అంగన్‌వాడీలకు గ్రామపంచాయతీల్లోని మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల సర్వే బాధ్యతలు అప్పగించడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య ప్రకటనలో అధికారులను కోరారు. క్షేత్ర స్థాయిలో ఆచరణకు సాధ్యం కాని సర్వేలను వారికి అప్పగించి పనిభారం మోపడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో అంగన్వాడీలకు కలెక్టర్ సర్వే బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రాలకు పిల్లలు వచ్చేలా ప్రోత్సహించి ఐసీడీఎస్ పనులు మాత్రమే అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు జిల్లాలోని గ్రూప్-2, 3 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫాం, సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు జత చేసి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 98491 52516 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి, పక్కన నాయకులు

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో బాసిర సంపత్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలుచేయాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో పెట్టుబడి రుణాల కోసం ఈనెల 12, 13వ తేదీల్లో బ్యాంకుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా రైతు రుణమాఫీ చేయాలని, కల్తీ ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని కోరారు. కొంతమంది వ్యాపారులు పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముతున్నారని వెంటనే వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సరిపడా నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.వాసుదేవరెడ్డి, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్, వరాల రవికుమార్, పిట్టల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డికి నిప్పంటించి.. మంటల్లో కాలిపోయి

- రాయికల్‌లో రైతు మృతి



భూమయ్య మృతదేహం

రాయికల్(జగిత్యాల): పొలంలోని గడ్డికి నిప్పంటించిన ఓ రైతు అవే మంటల్లో కాలిపోయి, మృతిచెందాడని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణానికి చెందిన తోపారపు నడ్పి భూమయ్య(70)కు స్థానిక శ్మశానవాటిక సమీపంలో రెండెకరాల పొలం ఉంది. సోమవారం అందులోని గడ్డికి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి, భూమయ్యకు అంటుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి చూడగా కాలిపోయిన మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు కల్లెడ ధర్మపురి, తోపారపు రవి కోరారు.

1.70 కేజీల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని: సుమారు 1.70 కేజీల గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మంథని పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. మంథని బస్సు డిపో ఏరియాలో ఎస్సై వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు దుబాసి రమేశ్, లుకా పెట్రోలింగ్ చే స్తున్నారు. ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించగా తనిఖీ చే శారు. దీంతో వారి వద్ద 1.70కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులు ప్రొఫెస ర్ జయశంకర్ భూ పాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన చకినారపు సంతోష్, పెద్దపల్లి జిల్లా మంథని సత్యసాయినగర్‌కు చెందిన పుల్లె ప్రశాంత్‌గా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. నిందితులు, గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై, కానిస్టేబుళ్లను ఏసీపీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

తల్లిగారింటికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో మహిళ మృతి



మణెమ్మ మృతదేహం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ మహిళ అందులోనే గుండెపోటుతో మృతిచెందింది. కాల్వశ్రీరాంపూర్ పోలీసు ల కథనం ప్రకారం.. ముత్తారం మండలంలోని ల క్కారం పంచాయ తీ పరిధి ఖాజీపల్లెకు జంగ మణెమ్మ(57) మంగళవారం త న కోడలు లతతో కలిసి కాల్వశ్రీరాంపూర్‌లోని తల్లిగారింటికి బయలుదేరింది. స్వగ్రామంలోనే గోదావరిఖని డిపోకు చెందిన కాల్వశ్రీరాంపూర్ వయా జమ్మికుంట ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మణెమ్మకు గుండెపోటు రావడంతో కండక్టర్, డ్రైవర్ ఆమెను కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా రు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కి భర్త రాజిరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మణెమ్మ మృతితో స్వగ్రామం ఖాజీ పల్లె, తల్లిగారిల్లు కాల్వశ్రీరాంపూర్‌లో విషాదం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం, నిందితుడిని చూపుతున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ.. పక్కా సమాచారంతో దేవునిపల్లిలోని బేడ బుడిగ జంగాల కాలనీలో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. వానరాశి నంబయ్య అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని సుల్తానాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించామని, నంబయ్యపై కేసు నమోదు చేశామన్నారు. డీటీ సీఎస్‌లు శంకర్‌గౌడ్, రవీందర్‌రాథోడ్, ఎఫ్ఐలు మల్లికార్జునరావు, శ్రీనివాస్, ఎస్సై శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

మంథని ఎంపీవో సరెండర్

మంథని: ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్‌పై వేటు పడింది. తమను వేధింపులకు గురిచేస్తున్నారని మంథని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ జరిపి, నివేదిక సమర్పించారు. ఈ మేరకు కలెక్టర్ ఎంపీవోను మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో మరో అధికారిని త్వరలోనే నియమిస్తామని డీపీవో ఆశాలత తెలిపారు.

చిరుత సంచారంపై ఆరా

ఓదెల(పెద్దపల్లి): మండలంలో చిరుతపులి సంచారంపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, బీట్ ఆఫీసర్ తిరుపతి మంగళవారం ఆరా తీశారు. ఇటీవల ఓదెల మండలంలోని గోపరపల్లె, పొత్కపల్లి, కొలనూర్ గుట్టల్లో చిరుత సంచరించిందని తెలియడంతో కాలి వేలిముద్రలను పరిశీలించారు. అవి హైనా లేదా లేపార్డ్‌క్యాట్‌వి కావచ్చొని అనుమానం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల వాసులెవరూ రాత్రిపూట బయటకు వెళ్లొద్దని సూచించారు.

అన్న పిల్లల పుట్టువెంట్రుకలకొచ్చి.. మృత్యుఒడికి

- వేములవాడలో గుండెపోటుతో యువకుడి మృతి
- మెడికల్ షాప్ ఎదుటే కుప్పకూలిన వైనం
- మృతుడిది జనగామ జిల్లా



వినయ్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


వేములవాడ: అన్న పిల్లల పుట్టువెంట్రుకలు తీసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో మృత్యుఒడికి చేరాడు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని 13వ వార్డు ధర్మకంచకు చెందిన బొట్ల వినయ్(23) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నేరేడుమెట్లలో ఉంటున్నాడు. తన అన్న శివకుమార్ కూతురు, కుమారుడి పుట్టువెంట్రుకలు తీసేందుకు తల్లిదండ్రులు ఇస్తారి, లక్ష్మి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి ప్రైవేట్ వాహనంలో సోమవారం వేములవాడ చేరుకున్నాడు. అద్దె గది తీసుకొని, అందరూ కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. పిల్లల పుట్టువెంట్రుకలు తీశారు. మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. అదే సమయంలో ఛాతిలో నొప్పి వస్తోందని వినయ్ తన తల్లికి చెప్పడంతో ఆమె జండూబామ్ రాసింది. అయినా నొప్పి తగ్గకపోవడంతో మందులు తెచ్చుకుంటానని మెడికల్ షాప్‌కు వెళ్లాడు. సరిగ్గా దుకాణం ఎదుటే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు అతన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అక్కడున్న రాజన్న భక్తులు కంటతడి పెట్టారు.



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు



క్యూలైన్లలో..



స్వామివారిని దర్శించుకుంటూ..

అంజన్న దర్శనానికి 3 గంటలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ముగుస్తుండటంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. 20 వేల మందికి పైగా వచ్చారని, స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అన్ని రకాల దర్శనాలకు టికెట్లు ఇచ్చే కౌంటర్ ఒక్కటే ఉండటంతో భారీ క్యూలైన్ ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. వాహన పూజకు భారీ వాహనాలు కొండపైకి రావడంతో ఇబ్బంది పడ్డారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, అధికారులు సునీల్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.